## భయం వీడి పరీక్షలకు సిద్ధం కావాలి

**కలెక్టర్ జితేశ్ వీ పాటిల్**



విద్యార్థులకు స్టడీ మెటీరియల్‌ను అందజేస్తున్న కలెక్టర్ జితేశ్ వీ పాటిల్

కామారెడ్డి, మే 25 : భయం వీడి చక్కటి ప్రణాళికతో పరీక్షలకు సిద్ధమైతే తప్పక విజయం వరిస్తుందని కలెక్టర్ జితేశ్ వీ పాటిల్ అభ్యర్థులకు సూచించారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గ్రూప్ 1, 2, 3 తదితర పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యేందుకు మూడు నెలలపాటు శిక్షణ పొందుతున్న 54 మంది ఎస్సీ అభ్యర్థులకు కలెక్టర్ స్టడీ మెటీరియల్‌ను శనివారం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులు సిలబస్‌ను అర్థం చేసుకొని అందుకు అనుగుణంగా సొంతంగా నోట్స్ తయారు చేసుకోవాలని అన్నారు. కరెంట్ అఫైర్స్‌పై ప్రత్యేక దృష్టి పెట్టి పట్టుదలతో సన్నద్ధం కావాలన్నారు. విజయాలు సాధించిన వారి స్ఫూర్తిని, ఇతరుల సహాయాన్ని తీసుకోవాలన్నారు. పరీక్షలు ఎంత కష్టంగా ఉన్నా సమర్థవంతంగా ఎదుర్కోగలమన్న ఆత్మవిశ్వాసంతో ముందుకెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్సీ అభివృద్ధి అధికారి రజిత, సహాయ ఎస్సీ అభివృద్ధి అధికారి వెంకటేశ్, కళాశాల ప్రిన్సిపాల్ విజయ్ కుమార్, టీఎన్‌జీవోస్ జిల్లా అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# 2.92 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోళ్లు

**అదనపు కలెక్టర్ చంద్రమోహన్**



కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ చంద్రమోహన్

కామారెడ్డి, మే 25 : జిల్లాలో ఇప్పటి వరకు 2.92 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామని అదనపు కలెక్టర్ చంద్రమోహన్ అన్నారు. మిగిలిన కొద్దిపాటి ధాన్యాన్ని త్వరగా పూర్తి చేయాలని కేంద్రాల నిర్వాహకులకు ఆదేశించారు. వివిధ మండలాల్లోని కేంద్రాల్లో కొనసాగుతున్న కొనుగోళ్ల ప్రక్రియను, రైస్ మిల్లుల్లో అన్ లోడింగ్‌ను జిల్లా పౌర సరఫరాల అధికారి మల్లికార్జున్ బాబు, ఇన్‌చార్జి జిల్లా మేనేజర్ నిత్యానందంతో కలిసి శనివారం పరిశీలించి పలు సూచనలు చేశారు. కేంద్రాల్లో తూకం వేసిన సంచులను తక్షణమే మిల్లులకు తరలించాలని సూచించారు. కామారెడ్డిలోని సీతారామ రైస్‌మిల్, మండలంలోని పలు రైస్ మిల్లులను పరిశీలించారు. రోజు 10 నుంచి 15 లారీల ద్వారా 2,584 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కేంద్రాల నుంచి మిల్లులకు తరలించామన్నారు. జిల్లాలో 297 కేంద్రాల ద్వారా కొనుగోళ్లు పూర్తి చేశామని చెప్పారు. జిల్లాలో ఇప్పటి వరకు 51,162 మంది రైతుల నుంచి రూ.656 కోట్ల విలువైన 2.92 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసి ఖాతాల్లో రూ.572 కోట్లు జమచేశామన్నారు. 65 శాతం ట్యాబ్ ఎంట్రీ కూడా పూర్తయిందని, మిగతా రైతులకు ఒకటి, రెండు రోజుల్లో డబ్బులు జమచేస్తామని తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్లు, డిప్యూటీ తహసీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.

**కొనుగోళ్లను వేగవంతం చేయాలి..**

రామారెడ్డి, మే 25: సదాశివనగర్ మండలం అడ్లూర్ ఎల్లారెడ్డిలో ఉన్న ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని అదనపు కలెక్టర్ చంద్రమోహన్ శనివారం సందర్శించారు. కొనుగోళ్లను వేగవంతం చేయాలని నిర్వాహకులకు సూచించారు. రైతులు ధాన్యాన్ని ప్రభుత్వ కొనుగోలు సెంటర్లలో విక్రయించాలన్నారు. ఆయనవెంట సొసైటీ చైర్మన్ సదాశివరెడ్డి, సీఈవో కడెం భైరయ్య తదితరులు ఉన్నారు.

## వేతన పెంపుపై బీడీ కార్మికుల హర్షం

దోమకొండ, మే 25 : వేతనాల పెంపుపై బీడీ కార్మికులు హర్షం వ్యక్తంచేశారు. వేతనాల పెంపుపై శనివారం హైదరాబాద్‌లో బీడీ మ్యానుఫ్యాక్చర్స్ అసోసియేషన్, బీడీ కార్మిక సంఘాలు చర్చలు నిర్వహించారు. చర్చల్లో మూల వేతనం బీడీ కార్మికులకు 4.25 పైసలు, నెలవారీ ఉద్యోగులకు రూ. 1,700, ప్యాకింగ్ కార్మికులకు రూ.3,650 పెంచడానికి యజమానులు అంగీకరించారు. ఈ పెంపు ఈ నెల నుంచి అమలుచేయాలని నిర్ణయించడంతో దోమకొండలో టెలిఫోన్ ప్యాకింగ్ కార్మికులు హర్షం వ్యక్తంచేశారు.

## వాహనాల తనిఖీ

బీబీపేట్, మే 25 : మండలంలోని శ్రీగాధ రోడ్డులో ఏఎస్సై ప్రభాకర్ సిబ్బందితో కలిసి శనివారం వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా ఏఎస్సై మాట్లాడుతూ.. సరైన ధ్రువపత్రాలు లేని 38 మంది వాహనదారులకు జరిమానా విధించామన్నారు. కార్యక్రమంలో సిబ్బంది నవీన్‌కుమార్, సాయిలు, శ్రీకాంత్ పాల్గొన్నారు.

## లైసెన్స్ ఉన్న దుకాణాల్లోనే విత్తనాలు కొనాలి



సమావేశంలో పాల్గొన్న ఎరువులు, విత్తనాల దుకాణాల యజమానులు

బాన్సువాడ, మే 25 : లైసెన్స్ ఉన్న దుకాణాల్లోనే ఎరువులు, విత్తనాలు కొనుగోలు చేయాలని వ్యవసాయ శాఖ ఏడీఏ వీరస్వామి అన్నారు. బాన్సువాడలోని వ్యవసాయ శాఖ కార్యాలయంలో విత్తనాలు, ఎరువుల దుకాణాల యజమానులతో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా విత్తనాలు, ఎరువులను అందించాలని సూచించారు. స్టాక్ రిజిస్టర్లను ఎప్పటికప్పుడూ సరిచూసుకోవాలన్నారు. విత్తనాలు ఇచ్చే ముందు ప్యాకింగ్ సరిగా ఉన్న బస్తాలను మాత్రమే రైతులకు అందించాలని చెప్పారు. కార్యక్రమంలో ఏవో సుధాకర్, దుకాణాల యజమానులు చిదుర వినయ్ గుప్తా, నాగులగామ మురళి, కిరణ్‌కుమార్, సిర్న దత్తు, అరున్‌కుమార్, చందు, మోతీలాల్ తదితరులు ఉన్నారు.

## పనులు త్వరగా పూర్తి చేయాలి



బోర్లంలోని దళితవాడ ప్రాథమిక పాఠశాలలో కొనసాగుతున్న పనులను ఎంఈవో, ఎంపీవోతో కలిసి పరిశీలిస్తున్న ఎంపీడీవో బషీరుద్దీన్

బాన్సువాడ రూరల్, మే 25 : ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసేందుకు ప్రభుత్వం అమ్మ ఆదర్శ కమిటీలు వేసిందని, కమిటీ సూచనల మేరకు పాఠశాలలో మౌలిక సదుపాయాల కల్పనకు చేపడుతున్న పనులు పాఠశాలలు ప్రారంభం నాటికి పూర్తి చేయాలని ఎంపీడీవో బషీరుద్దీన్ కాంట్రాక్టర్‌కు సూచించారు. మండలంలోని బోర్లం గ్రామంలో దళితవాడలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను మండల విద్యాధికారి నాగేశ్వర్‌రావు, ఎంపీవో సత్యనారాయణరెడ్డితో కలిసి శనివారం పరిశీలించారు. పనులు త్వరగా పూర్తి చేయాలని సూచించారు. ఆయన వెంట గ్రామ పంచాయతీ కార్యదర్శి సాయికుమార్ ఉన్నారు.

## పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలి



మాందాపూర్‌లో మురికి కాల్వను శుభ్రం చేస్తున్న పారిశుద్ధ్య కార్మికులు

బీబీపేట్, మే 25 : పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని గ్రామ పంచాయతీ కార్యదర్శి నవీన్ అన్నారు. మాందాపూర్ గ్రామంలో శనివారం పారిశుద్ధ్య పనులను పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులతో చేయించారు. ఈ సందర్భంగా కార్యదర్శి నవీన్ మాట్లాడుతూ.. గ్రామంలో ప్రతిరోజూ పారిశుద్ధ్య పనులు చేయిస్తున్నామని తెలిపారు. గ్రామంలో నీటి ఎద్దడి లేకుండా చూస్తున్నామన్నారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

## కొలతల ప్రకారం పనులు చేయాలి



కొల్లూరులో ఉపాధిహామీ కూలీలతో మాట్లాడుతున్న ఏపీడీ వామన్‌రావు

బాన్సువాడ రూరల్, మే 25 : కూలీలకు కూలి గిట్టుబాటు కావాలంటే తప్పని సరిగా కొలతల ప్రకారం పనులు చేయాలని, తెలంగాణకు హరితహారం పథకంలో భాగంగా గ్రామాల్లో మొక్కలు నాటేందుకు జూన్ నాటికి నర్సరీల్లో మొక్కలు సిద్ధంగా ఉంచాలని ఏపీడీ వామన్‌రావు ఉపాధి హామీ అధికారులకు సూచించారు. మండలంలోని కొల్లూరు, సోమేశ్వర్ గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి హామీ పనులను శనివారం పరిశీలించారు. ఉపాధి హామీ పనులపై కూలీలతో మాట్లాడారు. ఉపాధిహామీ సిబ్బంది ఇచ్చిన కొలతల ప్రకారం పనులు చేస్తేనే సరైన కూలి వస్తుందని కూలీలకు తెలిపారు. అనంతరం తాడ్కోల్ గ్రామంలోని నర్సరీని పరిశీలించారు. నర్సరీల్లో పెంచుతున్న మొక్కల వివరాలను ఫీల్డ్ అసిస్టెంట్‌ను అడిగి తెలుసుకున్నారు. మొక్కలు ఎండిపోకుండా జాగ్రత్తలు తీసుకొని నాటేందుకు మొక్కలను సిద్ధం చేయాలని సూచించారు. ఆయన వెంట ఎంపీడీవో బషీరుద్దీన్, ఎంపీవో సత్యనారాయణ రెడ్డి, కార్యదర్శులు సృజన్‌రెడ్డి, ప్రశాంతి, ఉపాధి హామీ టెక్నికల్ అసిస్టెంట్ గోపాల్ తదితరులు ఉన్నారు.

## మండల మహిళా సమాఖ్యలో ఆడిట్

రాజంపేట్, మే 25 : రాజంపేట మండల మహిళా సమాఖ్యలో అధ్యక్షురాలు లక్ష్మి అధ్యక్షతన మండల మహిళా సమాఖ్యతోపాటు మండలంలోని 22 గ్రామ సంఘాలకు సంబంధించి 2023–24 వార్షిక ఆడిట్‌ను శనివారం నిర్వహించారు. 22 గ్రామ సంఘాల ఆడిట్ పూర్తయ్యిందని అధ్యక్షురాలు లక్ష్మి తెలిపారు. కార్యక్రమంలో అకౌంటెంట్ కృష్ణారెడ్డి, ఏపీఎం సాయిలు, సీసీలు, వీవోఏలు పాల్గొన్నారు.



రికార్డులను పరిశీలిస్తున్న ఆడిటర్లు

## ఎల్లారెడ్డిలో ఫిల్టర్‌బెడ్‌ను పరిశీలించిన బల్దియా చైర్మన్



సిబ్బందికి సూచనలు ఇస్తున్న బల్దియా చైర్మన్ సత్యనారాయణ

ఎల్లారెడ్డి రూరల్, మే 25: పట్టణ ప్రజలకు తాగు నీటిని అందించే ఫిల్టర్‌బెడ్‌ను మున్సిపల్ చైర్మన్ కుడుముల సత్యనారాయణ శనివారం పరిశీలించారు. వేసవిలో ప్రజలకు తాగునీటి ఇబ్బందులు కలుగకుండా చూసే విధంగా ఆయన సిబ్బందికి పలు సూచనలు చేశారు. పట్టణంలోని పలు వార్డుల్లో బోర్లు వేసి నీటి సమస్యను పరిష్కరిస్తున్నామని తెలిపారు. నీటి ఎద్దడి ఏర్పడితే ప్రజలు తన దృష్టికి తీసుకురావాలని, ఎమ్మెల్యే సహకారంతో బోర్లు వేసి నీటి సమస్య రాకుండా చూసుకుంటామన్నారు. ఆయనతోపాటు మున్సిపల్ సిబ్బంది ఉన్నారు.

## గురుకుల భవన నిర్మాణ పనులు ప్రారంభం



ప్రారంభమైన భవన నిర్మాణ పనులు

నాగిరెడ్డిపేట, మే 25: మండల కేంద్రంలో కొంతకాలంగా నిలిచిన ఎస్టీ గురుకుల భవన నిర్మాణ పనులు శనివారం తిరిగి ప్రారంభమయ్యాయి. మండలానికి 2016లో అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం ఎస్టీ గురుకుల పాఠశాలను మంజూరు చేసింది. పాఠశాల కోసం ఐదు ఎకరాల స్థలం కేటాయించడంతోపాటు రూ.3.70 కోట్ల నిధులను మంజూరు చేసింది. పనులు ప్రారంభించిన కాంట్రాక్టర్ పిల్లర్లు వేసి పనులను నిలిపివేశాడు. సొంత భవనం లేకపోవడంతో పాఠశాలను జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేటు భవనంలో కొనసాగిస్తున్నారు. కాగా.. ప్రస్తుతం భవన నిర్మాణ పనులు ప్రారంభం కావడంతో మండల ప్రజలు సంతోషం వ్యక్తంచేస్తున్నారు. పనులు త్వరగా పూర్తిచేసి భవనాన్ని అందుబాటులోకి తేవాలని వారు కోరుతున్నారు.

## అభివృద్ధి పనుల పరిశీలన



పనులను పరిశీలిస్తున్న ఎంపీడీవో లక్ష్మి

ఎల్లారెడ్డి రూరల్, మే 25: మండలంలోని తిమ్మారెడ్డి గ్రామంలో ఉన్న అమ్మ ఆదర్శ పాఠశాలలో కొనసాగుతున్న పనులను ఎంపీడీవో లక్ష్మి, ఎంపీవో ప్రకాశ్ శనివారం పరిశీలించారు. పాఠశాలలో చేపడుతున్న వాష్‌రూమ్, విద్యుత్ మరమ్మతులు, ఫిల్టర్ వాటర్, సింక్ ఏర్పాటు తదితర పనులను తనిఖీ చేశారు. పాఠశాల ప్రారంభం నాటికి పనులను పూర్తిచేయాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. వారితోపాటు పంచాయతీ కార్యదర్శి విజయ్ తదితరులు ఉన్నారు.

# వైద్యులు ఫుల్.. సేవలు నిల్

- సిస్టర్లు, సిబ్బందితోనే పరీక్షలు
- నామమాత్రంగా అందుతున్న వైద్య సేవలు
- మద్నూర్ ప్రభుత్వ దవాఖానలో రోగులకు తప్పని తిప్పలు



ఖాళీగా ఉన్న వైద్యుల కుర్చీలు




మద్నూర్‌లోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్

మద్నూర్, మే 25: మండల కేంద్రంలోని పెద్ద దవాఖానలో అన్ని సౌకర్యాలు ఉన్నా.. రోగులకు సేవలు మాత్రం అందడం లేదు. ఆరుగురు డాక్టర్లు ఇక్కడ పనిచేస్తున్నా.. తమకు వీలు ఉన్నప్పుడు మాత్రమే వారు దవాఖానకు వస్తారు. రోజుకు ఒకరు చొప్పున తమకు విధులను వారు కేటాయించుకుంటున్నారు.

ఓపీలో కూడా వైద్య సేవలను అందించడానికి ఒకరిద్దరు మాత్రమే వస్తున్నారు. దీంతో మద్నూర్ ప్రభుత్వ దవాఖానకు వచ్చిన రోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అత్యవసర సమయంలో దవాఖానకు వస్తే డాక్టర్లు లేకపోవడంతో ఉన్న సిబ్బంది తమకు తెలిసిన వైద్యం చేసి ఇతర దవాఖానలకు రిఫర్ చేస్తున్నారు. ప్రభుత్వ దవాఖానలో వైద్యులు లేకపోవడంతో ప్రైవేటు దవాఖానలకు వెళ్లి చికిత్సలు చేయించుకోవడంతో ఆర్థికంగా నష్టపోతున్నారు.

ఆరుగురు వైద్యుల్లో డెంటిస్ట్ తప్పా మిగిలిన వారందరూ మహారాష్ట్రకు చెందిన వారు కావడం గమనార్హం. వారందరికీ దెగ్లూర్‌లో పెద్ద దవాఖానలు ఉన్నాయి. దీంతో వారు అక్కడే విధులను నిర్వహిస్తూ.. ప్రభుత్వ దవాఖానకు రావడం లేదు. మద్నూర్ ప్రభుత్వ వైద్యశాలకు ఎప్పుడో ఒకసారి నామమాత్రంగా వచ్చి వెళ్తున్నారు. కొందరైతే ఇక్కడ ప్రభుత్వ దవాఖానకు వచ్చిన రోగులకు తమ క్లినిక్‌కు వచ్చి చూయించుకోవాలని సూచిస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఈ విషయమై జిల్లా వైద్యాధికారితోపాటు కలెక్టర్‌కు కూడా మండల ప్రజలు పలుమార్లు ఫిర్యాదు చేశారు. ఇటీవల మండల కేంద్రానికి చెందిన సంతోష్ అనే యువకుడు ద్విచక్ర వాహనం పైనుంచి పడడంతో గాయాలయ్యాయి. వెంటనే అతడి మిత్రులు మద్నూర్ ప్రభుత్వ దవాఖానకు తీసుకువచ్చారు. వైద్యులు లేక, విధులు నిర్వహిస్తున్న నర్సు ఏమీ చేయలేక మరో వైద్యశాలకు వెళ్లాలని సూచించింది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ప్రభుత్వ దవాఖానలో డాక్టర్లు ప్రతిరోజూ అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

## అసంపూర్తిగా సబ్ సెంటర్ నిర్మాణం



అసంపూర్తిగా ఉన్న వదలపర్తిలోని హెల్త్ సబ్‌సెంటర్ భవనం

నాగిరెడ్డిపేట, మే 25: మండలంలోని వదలపర్తి గ్రామంలో నిర్మిస్తున్న సబ్ సెంటర్ పనులు అసంపూర్తిగా నిలిచాయి. వదలపర్తి, పోచారం గ్రామాలను కలుపుకొని గత ఏడాది సబ్ సెంటర్ కోసం ప్రభుత్వం రూ.25లక్షలను మంజూరు చేసింది. కాంట్రాక్టర్ పనులు ప్రారంభించి.. నాలుగు నెలల క్రితం నిలిపివేశాడని గ్రామస్తులు తెలిపారు. అధికారులు స్పందించి నిర్మాణ పనులు పూర్తయ్యేలా చూడాలని వారు కోరుతున్నారు. కాగా.. బిల్లులు చెల్లించకపోవడంతోనే పనులను నిలిపివేసినట్లు కాంట్రాక్టర్ చెబుతున్నాడు. తనకు రూ.14లక్షల వరకు బిల్లులు రావాల్సి ఉన్నదని, ఇప్పటివరకు కేవలం రూ.6.50లక్షల బిల్లులు మాత్రమే వచ్చాయని తెలిపాడు. బిల్లులు చెల్లిస్తే పనులు పూర్తి చేస్తానని కాంట్రాక్టర్ తెలిపారు.

నమస్తే తెలంగాణ CLASSIFIEDS క్లాసిఫైడ్స్

**CHANGE OF NAME**

★ I, MONCHU LIMBANNA S/o.MONCHU RAJANNA, H.No.6-37, Renjarla, Balkonda, Nizamabad Changed my name as MENCHU LIMBANNA S/o. MENCHU RAJANNA

NTZ-324691

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
4 లైన్ల క్లాసిఫైడ్స్ 200/- మాత్రమే.
ప్రతి అదనపు లైనుకు 50/- మాత్రమే

**గమనిక**

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

## జొన్నల కొనుగోళ్లు ప్రారంభం

**త్వరగా పూర్తిచేయాలని రైతుల విన్నపం**



గాంధారి వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆవరణలో చేపడుతున్న జొన్నల కొనుగోళ్లు

గాంధారి, మే 25: మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆవరణలో ఏర్పాటు చేసిన జొన్నల కొనుగోలు కేంద్రంలో శనివారం కాంటాలు ప్రారంభమయ్యాయి. కొనుగోలు కేంద్రంలో గోనె సంచులు లేకపోవడంతో రెండు రోజుల క్రితం కొనుగోళ్లను నిలిపివేశారు. శుక్రవారం రాత్రి గోనె సంచులు రావడంతో శనివారం కొనుగోళ్లను తిరిగి ప్రారంభంచారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని కొనుగోళ్లను వేగవంతం చేయాలని రైతులు కోరుతున్నారు.

## 30న మండల సర్వసభ్య సమావేశం

ఎల్లారెడ్డి రూరల్, మే 25: లింగంపేట మండల సర్వసభ్య సమావేశాన్ని 30వ తేదీన నిర్వహించనున్నట్లు ఎంపీడీవో నరేశ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించే సమావేశానికి ప్రజా ప్రతినిధులు, ఆయా శాఖల అధికారులు సకాలంలో హాజరు కావాలని సూచించారు. సమావేశంలో ఇప్పటివరకు చేపట్టిన అభివృద్ధి పనులతోపాటు చేపట్టాల్సిన పనులపై చర్చించనున్నట్లు తెలిపారు.

## శిక్షణ శిబిరాన్ని సందర్శించిన జిల్లా క్రీడా అధికారి



క్రీడాకారులతో అధికారి దామోదర్‌రెడ్డి

గాంధారి, మే 25: తెలంగాణ రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో మండలంలోని రాంపూర్‌గడ్డలో ఏర్పాటు చేసిన వాలీబాల్ వేసవి శిక్షణ శిబిరాన్ని జిల్లా క్రీడా అధికారి దామోదర్ రెడ్డి శనివారం పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన శిక్షణ పొందుతున్న క్రీడాకారులతో మాట్లాడారు. క్రీడామైదానంలోని వసతులను వారిని అడిగి తెలుసుకున్నారు. శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని, భవిష్యత్తులో రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించాలని సూచించారు. విద్యార్థులు, యువకుల్లో క్రీడలపై ఆసక్తిని పెంచుతున్న వ్యాయామ ఉపాధ్యాయుడు లక్ష్మణ్‌రాథోడ్‌ను ఈ సందర్భంగా ఆయన అభినందించారు.

## లింగంపేట మండలంలో ఎలుగుబంటి సంచారం

ఎల్లారెడ్డి రూరల్, మే 25: లింగంపేట మండల పరిధిలోని మెంగారం, బోనాల్, చింతలగుట్టతండా పరిసరాల్లో ఎలుగుబంటి సంచరిస్తుండడంతో ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారు. లింగంపేటలో శుక్రవారం వారాంతపు సంత ముగించుకొని వెళ్తున్న ఆయా గ్రామాల ప్రజలకు మెంగారం సమీపంలో ఎలుగుబంటి కనిపించింది. చెరువులో నీరు తాగేందుకు వస్తున్న ఎలుగుబంటిని చూసి ప్రజలు భయభ్రాంతులకు గురయ్యారు. ఎలుగుబంటి రెండు, మూడు గ్రామాల మధ్యనే తిరుగుతుండడంతో వ్యవసాయ పనులు, ఇతర గ్రామాలకు వెళ్లే ప్రజలు భయపడుతున్నారు. అటవీశాఖ అధికారులు స్పందించి ఎలుగుబంటిని బంధించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.